క్లుప్తంగా

అసత్య ఆరోపణలు తగవు



దమ్మపేటలో ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్న లంబాడీలు

దమ్మపేట: లంబాడీల ఆత్మగౌరవం దెబ్బతీసేలా కొందరు ప్రజాప్రతినిధులు అసత్య ఆరోపణలు చేయడం తగదు అని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రం దమ్మపేటలో లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్ భగవాన్ రెడ్డికి వినతి పత్రము అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకుల లబ్ధికోసం అన్నదమ్ముల వలే ప్రశాంతంగా ఉంటున్న గిరిజన తెగల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 14న కొత్తగూడెంలో జరిగే లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, లావుడ్యా ప్రసాద్, బాలాజీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన

దుమ్ముగూడెం: మండల పరిధిలోని సూరారం ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న మచ్చ బాబురావు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయిన నేపథ్యంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అభినందనలు తెలియచేశారు. మండల అధ్యక్షుడు వాసం ఆదినారాయణ మాట్లాడుతూ.. మచ్చ బాబురావు పాఠశాల సమయము కంటే ముందుగానే పాఠశాలకు చేరుకుని విద్యార్థులను 100 శాతం హాజరు ఉండే విధంగా కృషి చేశారని, అదేవిధంగా గతంలో పనిచేసిన ఎంపీపీఎస్ కొత్తూరు పాఠశాలలో 60 మంది పైగా పిల్లలకు ఏకపాధ్యాయుడిగా పనిచేసి, విద్యార్థులందరను ప్రయోజకులుగా తయారు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ మండల ప్రధాన కార్యదర్శి పూనెం రమేష్, మట్ట వెంకటేశ్వర్లు, సోడి రాంబాబు, పూనం నరేష్, పాయం రామ చిట్టి, జగడి వెంకటేశ్వర్లు, సోడి కష్టార్జునరావ్, సోందే రత్నాకర్, కల్లూరి భద్రయ్య, గొర్రె రామకృష్ణ, పెనుబల్లి రమేష్ అభినందనలు తెలియజేశారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి



పత్రాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ సురేష్

పినపాక: వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్సై సురేష్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు లేని వాహనాలకు చలానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా లిఫ్ట్ అడిగితే ఇవ్వద్దని, అసాంఘిక వ్యక్తులకు సహకరించవద్దని సూచించారు.

సాయినాథుడికి పూజలు



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు మండలానికి చెందిన రాయపురెడ్డి శ్రీనివాసరావు-భాగ్యలక్ష్మి దంపతులు, అఖిల్ సాయి, లియాంక్‌లు సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయగా.. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నదాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

పినపాక: మండల పరిధిలోని దుగ్గినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నుంచి 80 కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బెల్లం సాంబశివరావు, కేత ప్రసాద్, పూణెం జగన్, బేరం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరదొస్తే రహదారి మునిగినట్లే..

- దిగువకు ప్రవాహం లేక రోడ్డుపైనే నిలువ
- దుకాణాలు, ఇళ్లలోకి నీరు
- వాహనాల రాకపోకలకు అంతరాయం



రహదారి పక్కనే ఉన్న దుకాణంలోకి చేరిన వరద (ఫైల్)



దమ్మపేట ప్రధాన రహదారిని ముంచెత్తిన వరద (ఫైల్)

దమ్మపేట: భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో దమ్మపేట ప్రధాన రహదారి వరద నీటితో మునిగిపోతోంది. దమ్మపేటలోని రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ పశు వైద్యశాల నుండి అర్బన్ కాలనీ రోడ్డు వరకు దాదాపు 50 మీటర్ల మేర రోడ్డు అంతా పూర్తిగా నీటితో నిండిపోతోంది. ప్రతీ సంవత్సరం భారీ వర్షపాతం సంభవించినప్పుడు ఇదే చర్య పునరావృతమవుతోంది.

వరద ఎక్కడ నుంచి వస్తోంది?

మండలంలోని మందలపల్లి గ్రామ శివారులో ఉన్న అప్పకుంట చెరువు నుంచి వరద నీరు వ్యవసాయ క్షేత్రాల ద్వారా దిగువకు ప్రవహిస్తూ మండల కేంద్రంలోని మోడల్ కాలనీ, గాయత్రీ నగర్‌లను తాకుతూ ప్రధాన రహదారిపై చేరుతోంది. ఈ రహదారి నుండి వరద నీరు సమీపంలోని రాంజీకుంటకు కొంత భాగం, బాలాజీ థియేటర్ వైపు మరికొంత భాగం వెళ్లాల్సి ఉంది. బాలాజీ థియేటర్ వైపు వెళ్లే వీలు లేకుండా డ్రెయినేజీలు చెత్తాచెదారం, వ్యర్థాలు, మట్టితో పూర్తిగా నిండిపోయాయి. దీనితో ఎగువ నుండి ఉధృతంగా ప్రవహించే వరద నీరు దిగువకు ప్రవహించే వెళ్లే వీలులేక మోడల్ కాలనీ, గాయత్రీ నగర్‌లను ముంచెత్తడంతో పాటుగా ప్రధాన రహదారిపై పోటెత్తుతోంది. ఈ పరిస్థితిని నివారించడానికి కొంత ముందుచూపు మేర ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, అర్బన్ కాలనీ రోడ్డు వైపు ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు సామర్థ్యాన్ని ఇటీవలే పెంచడం జరిగింది. అయినప్పటికీ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దిగువకు వచ్చిన వరద నీరు కల్వర్టు ద్వారా కొంతమేరకు సమీపంలోని చెరువులోకి ప్రవహించినప్పటికీ వరద ముంచెత్తింది. రోడ్డు పక్కనే పదుల సంఖ్యలో ఉన్న దుకాణాలను, ప్రభుత్వ పశు వైద్యశాలలో ఈ వరద నీరు భారీగా చేరింది.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ..

కుండపోత వర్షం కురిసిన సందర్భాల్లో మండల పరిధిలోని మందలపల్లి అప్పకుంట చెరువు నుంచి దమ్మపేటకు ప్రవహించిన వరదనీరు.. డ్రెయినేజీలు, కల్వర్టుల గుండా దిగువకు ప్రవహించి సమీపంలోని చెరువులోకి చేరాలి. కానీ రోడ్డుకి ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలు పిచ్చి మొక్కలు, మట్టి, తదితర వ్యర్థాలతో నిండిపోయిన కారణంగా డ్రెయినేజీ పక్కనే ఉన్న కల్వర్టు కూడా వ్యర్థాలతో నిండిపోయింది. వరద నీరు దిగువకు ప్రవహించే వీలు లేక ప్రధాన రహదారిపైనే పోటెత్తుతుంది. ఈ సమస్యను నివారించడానికి డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసి, వరద ఉధృతికి తగినట్టుగా డ్రెయినేజీల వెడల్పును కూడా పెంచాలని స్థానికులు కోరుతున్నారు. వరద నీరు సమీపంలోని చెరువులకు ప్రవహించేలాగా మరొక కల్వర్టు నిర్మాణం ఏర్పాటు చేసే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ముంపు బాధితులు కోరుతున్నారు.

దుకాణాల్లోకి వరద నీరు..



భారీ వర్షం కురిసిన సందర్భాల్లో అప్పకుంట చెరువు నుంచి దమ్మపేటకు ప్రవహించిన వరద నీరు దిగువకు ప్రవహించే వీలు లేక రోడ్డును ముంచుతోంది. రోడ్డు పక్కనే ఉన్న మా దుకాణాల్లోకి భారీగా వరద నీరు చేరుకుంటుంది. దీంతో రెండు రోజుల పాటు దుకాణాలను మూసివేయాల్సి వస్తుంది. ఈ సమస్యకు పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా.

– కదార్ల శ్రీనివాస చారి, బైక్ మెకానిక్, దమ్మపేట

కల్వర్టు నిర్మాణం చేపట్టాలి



రోడ్డుకి ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలను వర్షాలు పడక ముందే పరిశుభ్రం చేయాలి. వరద నీటి ఉధృతికి తగినట్టుగా డ్రెయినేజీలను వెడల్పు చేసి, సరైన ప్రాంతంలో నూతన కల్వర్టు నిర్మాణం చేపట్టాలి. దీనిపై సంబంధిత అధికారులు తగు పరిశీలన చేసి, చర్యలు ప్రారంభించాలి. ముంపు సమస్యపై ఎమ్మెల్యే చొరవ చూపాలి.

– సుంకిపాక ధర్మ, సీపీఐ మండల కార్యదర్శి

డ్రోన్ వినియోగంపై అవగాహన



డ్రోన్ వినియోగం గురించి విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: గవర్నమెంట్ డిగ్రీ కళాశాల లైఫ్ సైన్స్, కంప్యూటర్ డిపార్టమెంట్ల ఆధ్వర్యంలో 'డ్రోన్- డ్రోన్ పైలెట్ రంగం, ఉపాధి అవకాశాలు'అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిమోట్ పైలెట్, ఐవా ఆగ్రో ఇన్నోవేటివ్స్ డైరెక్టర్ ఎం.సాయి కిరణ్, రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని విద్యార్థులకు డ్రోన్ల వినియోగం, పైలెట్ రంగంలో ఉపాధి అవకాశాలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించారు. కళాశాల ఆవరణంలో డ్రోన్ పనితీరును విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్, వైస్ ప్రిన్సిపల్ హవీలా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఏ.శ్రీను, అకాడమిక్ కోఆర్డినేటర్ హిమజ, అధ్యాపకులు డాక్టర్ రాఘసుమ, డాక్టర్ నాగసమీరా, డాక్టర్ కపిలభారతి, డాక్టర్ కిరణ్ కుమార్, సుధాకర్ రావు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై కృతజ్ఞతలు

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గ్రామమైన రాంనగర్ నుండి బట్టీలగుంపు వరకు రహదారికి రూ.1.5 కోట్లు మంజూరు చేసినందుకు రాంనగర్, బట్టీలగుంపు గ్రామస్తులు ఎమ్మెల్యే పాయంకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం బట్టీలగుంపులో రెండు గ్రామాల గ్రామస్తులు ప్రత్యేక సమావేశమై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బట్టా సత్యనారాయణ, కొమరం భాస్కర్‌రావు, కలివేటి సాంబశివరావు, కణితి కృష్ణవేణి, కలివేటి సమ్మక్క, కోరం దేవమ్మ, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలాభిషేకం..

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల సరిహద్దులో బాటన్ననగర్-రాయగూడెం మధ్యలో బీటీ రోడ్డు, కల్వర్ట్‌కు రూ.6 కోట్ల నిధులు మంజూరుపై ఆయా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం పినపాక ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్‌కె.ఖదీర్, పడిగ సమ్మయ్య, ఏఎంసీ డైరెక్టర్ ఊకె బుచ్చయ్య, ఆళ్లపల్లి మండల నాయకులు వాసం శ్రీకాంత్, గుండాల మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, సీనియర్ నాయకులు మోకాళ్ల బుచ్చయ్య, జర్పుల సక్రు, పూనెం లక్ష్మి, సోషల్ మీడియా సభ్యులు మండలోజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ బ్యాలెట్ ఓటింగ్



ఓపెన్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మణుగూరురూరల్: సీఐటీయూ మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏరియాలోని ఓసీ2, ఓసీ4, కొండాపురం భూగర్భగని, జీఎం కార్యాలయం, ఏరియా వర్క్‌షాప్ తదితర విభాగాల్లో గురువారం ఓపెన్ బ్యాలెట్ ఓటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ బ్యాలెట్ ఓటింగ్‌లో ఆయా విభాగాల కార్మికులు పాల్గొని ఓట్లతో తమ మద్దతును తెలిపారు. అనంతరం సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వి.వెంకటరత్నం మాట్లాడుతూ.. కార్మికుల ప్రధానమైన డిమాండ్లను సాకారం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మణ్‌రావు, జి.శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాస్, నెల్లూరి నాగేశ్వరరావు, సాంబశివరావు, సుమన్, విల్సన్, రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న మతోన్మాద శక్తులకు, వేగంగా విస్తరిస్తున్న కార్పొరేట్ రంగానికి వ్యతిరేకంగా పోరాటాలను నిర్వహించడమే సీతారాం ఏచూరికి తామిచ్చే నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గురువారం స్థానిక చందర్‌రావు భవనంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో మచ్చ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగ, బండారు శరత్ బాబు, పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, నకరికంటి నాగరాజు, జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాజాపురం వాసికి డాక్టరేట్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని రాజాపురం వాసి అయిన తడికమళ్ల సంజీవరావుకు డాక్టరేట్ లభించింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ప్రసిద్ధ శ్రీసత్యసాయి సాంకేతిక, వైద్యశాస్త్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను ఆయన పొందారు. 'ఫ్రాక్షనల్ ఆర్డర్ అబ్జర్వర్ బెస్ట్ ఆప్టిమల్ కంట్రోలర్ ఫర్ లోడ్ ఫ్రీక్వెన్సీ కంట్రోల్ ఆఫ్ పవర్ సిస్టం ఇన్ డిరెగ్యూలేటెడ్'అనే అంశంపై సంజీవరావు పరిశోధనలు చేశారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు

చంద్రుగొండ: పది లక్షల ప్రమాదబీమ సదుపాయలం కల్పించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం చంద్రుగొండలో పాలాభిషేకం చేశారు. రూ.5 లక్షలు ఉన్న బీమా సదుపాయాన్ని రూ.10 లక్షలు చేయడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దాసరి కృష్ణ, లక్ష్మణ్, ఆసీఫ్, అతీఖుల్ రెహమాన్, నజీర్, రవి, అక్బర్, గోపాల్, సతీష్‌లతోపాటు యూత్ కాంగ్రెస్ నాయకులు అన్వర్‌హుసేన్, యండి.ఇమ్రాన్ పాల్గొన్నారు.

బియ్యం వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన సోలిపురం నర్సిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. నర్సిరెడ్డి కుమారుడు సైదిరెడ్డితో మల్లెలమడుగు జెడ్పీ స్కూల్‌లో చదువుకున్న 2000-01 పదవ తరగతి పూర్వ విద్యార్థులు దశ దినకర్మలకు తమ మిత్రుడు కుటుంబానికి గురువారం క్వింటా బియ్యం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తులసి అశోక్, గుంజాల శంకర్, రామాచారి, తోకల విజయ్, గూడురు శ్రీనివాసరెడ్డి, దారపు శ్రీను, పసుల లింగయ్య, సతీష్, గొడుగు సురేష్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చండి

అశ్వాపురం: మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి పై ప్రమాదకరంగా ఉన్న గుంతలను తక్షణమే పూడ్చాలని బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న ఆ రహదారిపై గురువారం రోడ్డుపై ఉన్న గుంతల్లో కూర్చొని రామకృష్ణ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారిపై భారీగా గుంతలు పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాజీ ఉండదు



దమ్మపేట: పున్నమ్మ ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గాన్ని అభివృద్ధి, పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ఎలాంటి రాజీ ఉండదని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. గురువారం ఆయన అశ్వారావుపేట క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మేరకు ఐదు మండలాల్లో బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.4.76 కోట్లు మంజూరు కాగా.. వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల రోడ్లకు మరో రూ.3 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 178 మంది లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.76 కోట్ల చెక్కులు మంజూరు కాగా, ఆయా చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే అశ్వారావుపేట మున్సిపాలిటీ భవనం నిర్మాణానికి రూ.7 కోట్లు, మార్కెట్ నిర్మాణానికి రూ.2 కోట్లు, మండలానికో బీటీ రోడ్డు కోసం రూ.13 కోట్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశామని, త్వరలోనే మంజూరు అవుతాయని తెలిపారు. అనంతరం మండలంలోని తిరుమలకుంట, ఆసుపాక, నారాయణపురం గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి వద్దకే వెళ్లి అందించారు. ఊట్లపల్లి గ్రామంలో కరెంట్ షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెక్కును, బచ్చువారిగూడెంలో రూ.12 లక్షల వ్యయంతో మంజూరైన అంగన్‌వాడీ కేంద్రం భవనానికి, నారంవారిగూడెం పాఠశాలలో రూ.4 లక్షలతో మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలకు, దిబ్బగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రూ.10 లక్షలతో మంజూరైన గోడ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో ట్రాన్స్‌కో ఏడీఈ వెంకట రత్నం, పీఆర్ డీఈఈ శ్రీధర్, ఏఈఈ అక్షిత, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, బండి చెన్నారెడ్డి, ఎస్‌కే బాబా, కొల్లు చంద్రరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటన..

దమ్మపేట: మండలంలోని నాచారం, సీతారంపురం గ్రామాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ 'హలో శుభోదయం' పేరిట గురువారం పర్యటించారు. గ్రామ వీధుల్లో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలు ఆరా తీశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. నాచారంలో యర్రగొర్ల రాఘవులు-నాగరత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రాధాకృష్ణ వాటర్ ట్యాంకు ట్రాలీని సమకూర్చగా ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే, హరిజనవాడలో తాళ్ల పున్నమ్మ భోజనం చేస్తుండగా వారితో కలిసి భోజనం చేశారు. కాంగ్రెస్ నాయకులు సత్యప్రసాద్, ఎల్లిన రాఘవరావు, రాధకృష్ణ, చీకటి శ్రీను, జల్లిపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో ఎమ్మెల్యే సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: బయ్యారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీకి సంబంధించి అధికారుల నుండి నివేదికలో తీసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు పంచాయతీలో అందుతున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. వాటిని సంబంధిత అధికారులకు పంపించి సమస్యల పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఏడీఏ తాతారావు, ఏఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ వైద్యుడు మధు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిత్యావసరాల వితరణ

దమ్మపేట: కడు పేదరికంతో బాధపడుతున్న ఇద్దరు వృద్ధ మహిళలకు, గౌతమ బుద్ధ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావసరాలను గురువారం వితరణగా అందజేశారు. మండలంలోని మల్కారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళలు తోట పోతమ్మ, కాంతమ్మ, అదే గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అంకత మల్లిఖార్జునరావులకు దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి చేతులమీదుగా నిత్యావసరాలు, పండ్లను అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు అజీమ్, అబ్బులు, రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బియ్యం..

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న శ్రీవిద్యాభ్యాస(బాలవెలుగు) పాఠశాలకు, పీవీకాలనీలోని మదర్సాకు పీకేఓసీ-2 సీ రిలే ఆపరేటర్ షేక్ జాకిర్ హుస్సేన్ గురువారం 25కేజీల చొప్పున మొత్తం 50కేజీల బియ్యాన్ని అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు విందును ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్ కుటుంబ సభ్యులు, పాఠశాల నిర్వాహకులు జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణత్యాగం మరువలేనిది..



మొక్క నాటుతున్న కమాండెంట్ ఎస్‌కె.భద్ర, సిబ్బంది

అశ్వాపురం: అడవులను, వణ్యప్రాణులను రక్షించడంలో ప్రాణాలు వదిలిన వారి త్యాగం మరువలేనిదని, వారిని స్మరించుకోవడం, గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్ కార్నల్ ఎస్‌కె.భద్ర అన్నారు. మిట్టగూడెంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాంపులో గురువారం జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. చెట్ల పెంపకం డ్రైవ్, అటవీ సంరక్షణపై అవగాహన, అటవీ అమరవీరులకు నివాళి, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. క్యాంపు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ నవీన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ రవి బండారుపల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ..

కరకగూడెం: ఎమ్మెల్సీ తాత మధుసూదన్ రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు గురువారం కరకగూడెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. శ్రీరంగాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు జాడి మురళీధర్, నరసింహారావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామానాథంల మాతృమూర్తి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. ఆమె దశదినకర్మలకు వారు హాజరై మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరకగూడెం గ్రామానికి చెందిన పంక్చర్ షాప్ నిర్వాహకుడు ఆడెపు సతీష్ ఇటీవల ప్రమాదానికి గురై ఇంట్లో కోలుకుంటుండగా.. అతని నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భవిత కేంద్ర నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో నిర్మించనున్న దివ్యాంగ విద్యార్థుల భవిత కేంద్రం స్థలాన్ని యంఇఓ సున్నం సమ్మయ్య గురువారం పరిశీలించారు. లక్ష్మీనగరం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించి భవిత కేంద్రాన్ని త్వరలోనే నిర్మించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ దుర్గా శ్రీనివాస్, కాంట్రాక్టర్ టి.రమేష్ గౌడ్, హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఐఈఆర్‌పీలు సతీష్, రాగిణి పాల్గొన్నారు.

సీబీఐ విచారణకు సిద్ధం కావాలి

మణుగూరుటౌన్: కాళేశ్వరంపై సీబీఐ విచారణకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమై చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.నవీన్ సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. నాయకులు శివ సైదులు, తరుణ్‌రెడ్డి, కూచిపూడిబాబు, రహీం పాషా, టీ.వీ.సుబ్బారెడ్డి, పాతూరి వెంకన్న, గాండ్ల సురేశ్, చింతల కృష్ణ, మహబూబ్, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగే వరకూ పట్టించుకోరా?



కోతకు గురవుతున్న బీటీ రోడ్డు

ములకలపల్లి: ములకలపల్లి శివారులోని మాధారం వాగు సమీపంలో బీటీ రోడ్డు క్రమేపీ కోతకు గురవుతూ ప్రమాదకంగా మారుతోంది. ఆగస్టు 31 అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పాల్వంచ-మందలపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు సైడ్‌బర్మ్ వంతెన వద్ద కోతకు గురై.. భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీనికి సుమారు వంద మీటర్ల దిగువన చెక్‌డ్యాం నిర్మించడం, అదే ప్రదేశం వాగు మలుపు తిరగడంతో నీటి ప్రవాహ ధాటికి రోజురోజుకూ బీటీ రోడ్డు కూడా దెబ్బతింటోంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ దారిలో భారీ గుంతతో ఏ ప్రమాదం ఏర్పడుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మరోమారు భారీ వర్షం కురిస్తే రోడ్డు పూర్తిగా తెగిపోయే ప్రమాదముంది. ఘటన జరిగి పది రోజులు దాటుతున్నా, పట్టించుకునే వారే కరువయ్యారు. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపట్ల పలువురు తీవ్ర ఇగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగే వరకూ పట్టించుకోరా..? అని ప్రశ్నిస్తున్నారు.